కూరగాయలకు పెద్దకోట

- కూరగాయలు, ఆకుకూరల సాగుతో జీవనోపాధి
- ఊరిలో ఎక్కువ కుటుంబాలది ఇదే వ్యాపారం
- సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా సాగు
- పెద్దకోట కూరగాయలకు మంచి గిరాకీ


ఆకుకూరలను కట్టలు కడుతున్న రైతు కుటుంబం


కూరగాయల పంటకు ఏతాంతో నీరు తోడుతున్న రైతు

ఎల్.ఎన్.పేట: పచ్చని కూరగాయలు.. ఆకు కూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డాక్టర్లు సూచిస్తున్నారు. తాజాగా ఉండే వాటిని కొనుగోలు చేసేందుకు ప్రతిఒక్కరూ ఎంతో ఇష్టం చూపిస్తారు. అవే కూరగాయలు, ఆకు కూరలు పెద్ద కోట గ్రామంలోని అనేక కుటుంబాలకు జీవనాధారం. కూరగాయాల పంటలను పండించేది వారే... విక్రయించేది వారే కావటంతో గిట్టుబాటు ధరను పొందుతున్నారు. మండల కేంద్రానికి కిలో మీటరు దూరంలో ఉన్న పెద్దకోట కూరగాయల పంటలకు 'పెద్ద'కోట'..గా చెప్పుకోవచ్చు. ఉన్న కొద్దిపాటి పొలంలో రకరకాల కూరగాయల పంటలను పండిస్తుంటారు. భూమిలేని కుటుంబాలవారు రైతులు పండించిన కూరగాయలు కొనుగోలు చేసి మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాలకు సైకిళ్లు, మోపెడ్, ఇతర వాహనాలు, కావిడితో మోసుకుని వెళ్లి అమ్ముతూ జీవిస్తున్నారు. సీజన్‌తో పని లేకుండా ఏడాది పొడవునా కూరగాయలు, ఆకు కూరల పంటలను పండించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఎంతో రుచి...

పెద్దకోటలో పండించే కూరగాయాలు ఎంతో రుచిగా ఉంటాయని ఈ ప్రాంతంలో ప్రచారం ఉంది. పక్క గ్రామాల్లోకి అమ్మకానికి కూరగాయలు తెచ్చినా, మార్కెట్‌కు వెళ్లినా ఇవి 'పెద్దకోట కూరగాయలేనా' అని అడిగి మరీ కొంటారు. ఎంతో రుచిగా ఉండే పెద్దకోట కూరగాయలంటే ఒక రూపాయి ఎక్కువ ఇచ్చి అయినా కొనుగోలు చేసేందుకు తెలిసిన వారెవ్వరూ వెనుకాడరు.

ఇది పరిస్థితి..	
పెద్దకోటలో నివసిస్తున్న కుటుంబాలు	192
కూరగాయల సాగు విస్తీర్ణం	85 ఎకరాలు
పండించే కూరగాయల రకాలు	చిక్కుడు, వంగ, బీర, బెండ, దొండ, టమాట, కాకర, క్లాలీఫ్లవర్, క్యారెట్, అన్ని రకాల ఆకుకూరలు, మొక్క జొన్న, మరి కొన్ని రకాల కూరగాయలు
రోజుకు వచ్చే దిగుబడి	250 కిలోలకు పైనే (సీజన్‌లో ఎక్కువే)
మార్కెట్ పరిస్థితి	మండల కేంద్రంలోను, సైకిళ్లతో ఊరూర తిరిగి అమ్ముతుంటారు.
ఒక రోజు ఒక కుటుంబ ఆదాయం	రూ.2 వేలకు పైనే

ఆదాయం బాగుంది



మా తాతల కాలం నుంచి కూరగాయల సాగుచేస్తున్నాం. మాకు ఉన్న పొలంతో పాటు రైతుల వద్ద కౌలుకు తీసుకుని కూరగాలయ పంటలు పండిస్తుంటాం. కూరగాలయ దిగుబడి రోజూ వస్తోంది. ప్రతిరోజూ ఎంతో కొంత ఆదాయం అందివస్తోంది. చెరువులో నీరు ఉంటే పంటలకు డోకా ఉండదు. వేసవిలో సాగునీటికి ఇబ్బంది ఉంటుంది. ఊరిలో అందరూ కూరగాలయ సాగుపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంటారు.

– బొడ్డాన కైలాస్, రైతు–వ్యాపారి, పెద్దకోట, ఎల్.ఎన్.పేట

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలి

రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మనకు మనం సొంతంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించడంతో ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం ఇవ్వడానికి, సామాజిక న్యాయం ప్రోత్సహించడానికే రాజ్యాంగాన్ని రూపొందించారని వక్తలు తెలిపారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరించి, గౌరవించాలన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు పాటు పడదామని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఆమదాలవలస: జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు



జలుమూరు: లింగాలవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు గీచిన భరతమాత చిత్రం


నరసన్నపేట: కోర్టులో సిబ్బంది, న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సివిల్ జడ్జి హరిప్రియ


నరసన్నపేట: లక్ష్మీ టాకీస్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు


బూర్జ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న అధికారులు, సిబ్బంది


పాతపట్నం: జై భీమ్ ఆకారంలో కాగువాడ జ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థినులు


సారవకోట: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది


పొందూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, దళిత ఐక్య వేదిక సభ్యులు


కొత్తూరు: నాలుగు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


హిరమండలం: న్యూబ్యారేజీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాతపట్నం: కోర్టు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెళియాపుట్టి: గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు


ఎల్.ఎన్.పేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ త్రినాథులు, తదితరులు


జలుమూరు: జాతీయ నాయకుల వేషధారణల్లో రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

ఎవరి ప్రయోజనాల కోసం ఈ రోడ్డు ?

నరసన్నపేట: జాతీయ ఉపాధి హామీ నిధులతో కూటమి ప్రభుత్వం నిర్మిస్తున్న సీసీ రోడ్లపై విమర్శలు వస్తున్నాయి. దీనికి నిదర్శనమే నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధి గొట్టిపల్లి కూడలిలోని విజయలక్ష్మీనగర్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన రోడ్డు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు లేవు. కొంతమంది వ్యాపారులు, రియల్ ఎస్టేట్ల కోసం ఈ రోడ్డు నిర్మించారని సమాచారం. ఈ రోడ్డును చూపించి సమీపంలో ఉన్న స్థలాలను కూటమి నాయకులు అధిక ధరలకు విక్రయించుకోవడానికి చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నరసన్నపేట టౌన్ పరిధిలో అనేక రోడ్లు శిథిలమయ్యాయని, వాటిని వదిలేసి ఒకరిద్దరి ప్రయోజనం కోసం రోడ్డు వేయాలా అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.


విజయలక్ష్మీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

క్లుప్తంగా

బోధనలో మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న క్రాంతికుమార్

హిరమండలం: ఉపాధ్యాయుడు పాఠ్యంశాన్ని బోధించినప్పుడు ప్రతి విద్యార్థినీ విధిగా భాగస్వామ్యం చేయాలని ఏపీ స్టాల్ ప్రోగ్రాం పరిశీలికుడు పి.క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో టీచ్ టూల్ పరిశీలన అభ్యర్థులతో సమావేశంలో నిర్వహించారు. ప్రతీ ఉపాధ్యాయుడు బోధనలో మెలకువలను పాటించాలన్నారు. పాఠ్యంశ సంభాషణలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. కో ఆర్డినేటర్ నాగరాజు, ఎంఈఓ కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గీతాలాపన


పాటలు పాడుతున్న అంధ కళాకారులు

ఆమదాలవలస: పట్టణంలోని శ్రీవాణీవిద్యానికేతన్‌లో దీప్తు వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ బ్లయిండ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంధ కళాకారులతో గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాడిన భక్తి, పలు సినీ గీతాలు విద్యార్థులను అలరించాయి. అనంతరం అంధకళాకారులకు పాఠశాల తరపున రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని అంధుల సంక్షేమానికి వినియోగిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. పాఠశాల ప్రతినిధులు బలివాడ వెంకటేశ్వర్లు, బలివాడ నారాయణమూర్తి, సంపత్‌కుమార్, హరిబాబు, తరుణ్, అప్పలనాయుడు, ప్రణవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

జలుమూరు: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని నరసన్నపేట సీఐ జె. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జలుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు, ప్రిన్సిపాల్ డి.వేణుగోపాలరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం

పాతపట్నం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ వి.రామారావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలపై మంగళవారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. ప్రిన్సిపాల్ టి.హేమసుందర్, వైకుంఠరావు, సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడ రైతు సేవా కేంద్రం వద్ద డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం ప్రారంభించారు. కేంద్రాలకు తెచ్చే ధాన్యం విషయంలో లేనిపోని కొర్రీలు పెట్టవొద్దని సిబ్బందికి సూచించారు. డీసీఎంఎస్ మేనేజర్ జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. యలమంచిలి గ్రామంలో 40 శాతం రాయితీపై చేప పిల్లలు, 90 శాతం రాయితీపై పని ముట్లు మత్స్యకారులకు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సమీపంలోని చెరువులో చేప పిల్లలు విడిచిపెట్టారు. చేపల పెంపకం ద్వారా జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రాయితీలు అందించడం జరుగుతుందన్నారు. చల్లవానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తనిఖీలు



ఆమదాలవలస పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలోని రైల్వే స్టేషన్, పోలీస్ స్టేషన్ జంక్షన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశామన్నారు. ఇటీవల పట్టణంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో పలువురు యువకులు గంజాయితో పట్టుబడటంతో కేసులు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామన్నారు.

– ఆమదాలవలస

అవగాహన..



ఆయుర్వేదిక్ మందుల వినియోగం, వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షళంత్రి ఆయుర్వేదిక్ వైద్యాధికారి పూజారి పురుషోత్తమరావు తెలిపారు. ఆయుర్వేద వైద్యంపై మంగళవారం మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపీడీఓ ఎం.పావని ఎంఈఓ శ్రీనివాసరావు, బాలరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌కుమార్, సాహితీప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

ఆందోళన..



ఈ చిత్రం బూర్జ మండలం ఓ.వి.పేట సమీపంలోనిది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు పొలంలోనే వరి కుప్పలు పెడుతున్నారు. వరి కోతలు ఇప్పటికే 80 శాతం వరకు పూర్తిచేశారు. పలు గ్రామాల్లో నూర్పిడిలు కూడా చేపట్టారు. ఇంతవరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో కళ్లాలు, పొలాలు, రహదారికి ఇరువైపులా ధాన్యం బస్తాలను నిల్వ చేస్తున్నారు. ఇంకా 20 శాతం మేర వరి పంట పొలంలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– బూర్జ

శిథిలావస్థ..



బూర్జ మండలం తోటవాడ గ్రామంలో గల బాలుర బీసీ వెల్ఫేర్ హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇందులో సుమారు 56 మంది విద్యార్థులు ఉంటున్నారు. భవనంలోని అన్ని గదుల్లోనూ పైభాగం పెచ్చులు ఊడిపోతోంది. వర్షా కాలంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– బూర్జ

కారుపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

కొత్తూరు: ఈ కారు ఎవరిది? అనే వార్త సాక్షిలో మంగళవారం ప్రచురితమైంది. ఈ వార్తపై స్థానిక ఎస్ఐ అమీర్ అలీ స్పందించారు. మండల కేంద్రంలోని బత్తిలి రోడ్డులో గల అగ్నిమాపక కేంద్రం సమీపంలో చాలా రోజుల నుంచి కారు ఉండటంతో పోలీసులు ఆరా తీశారు. కారుకు ఉన్న నంబర్‌ను పరిశీలించగా.. పార్వతీపురానికి చెందిన ఓ వ్యక్తి బైక్ నంబర్‌గా ఆన్‌లైన్‌లో చూపిస్తుందని ఎస్ఐ చెప్పారు. కారు కదలకపోవడంతో వేరే వాహనం సాయంతో స్టేషన్‌కు తీసుకువచ్చి దర్యాప్తు చేస్తామన్నారు.

కృష్ణదాస్‌పై ఫిర్యాదు శోచనీయం

- గతంలో టీడీపీ నాయకులు, జనసేన అధినేత మాటలు బయటకు తీయండి..


మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌పై తుళ్లూరులో రాజధాని రైతులు ఫిర్యాదు చేయడాన్ని పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్యతోపాటు నియోజకవర్గానికి చెందిన ప్రధాన నాయకులు ఈ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించారు. 2020 అక్టోబర్ 4వ తేదీన దేశవానిపేటలో డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పుడు కృష్ణదాస్ మాట్లాడిన వాటిని పరిగణలోనికి తీసుకొని రాజధాని రైతులు ఫిర్యాదు చేశారని ఇది అన్యాయమన్నారు. ఆ రోజు ఆయన మాటలు తప్పు అయితే, గత ప్రభుత్వ హయాంలో పలు సందర్భాల్లో ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రస్తుత స్పీకర్, అప్పటి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాటలు కూడా బయటకు తీయాలని, వారు ఎంత దారుణంగా మాట్లాడారో తెలుస్తుందన్నారు. ఎవరి మాటలు అసందర్భంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా అని కేసులు పెట్టి కృష్ణదాస్‌ను, వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. కృష్ణదాస్‌పై ఇచ్చిన ఫిర్యాదును అవసరమైతే న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ఆరంగి మురళి, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, నక్క తులసీదాస్, ధర్మాన జగన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- ఐసీడబ్ల్యూడీఎస్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు


మహిళలకు కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు

ఆమదాలవలస: మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఐసీడబ్ల్యూడీఎస్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 7వ వార్డు చింతాడ గ్రామంలో ఐసీడబ్ల్యూడీఎస్ (సమగ్ర శిశు మహిళాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా సంస్థలో నమోదైన డ్వాక్రా సభ్యులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడబ్ల్యూడీఎస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సుమన్ మాట్లాడుతూ.. సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లా పర్చేజింగ్ మేనేజర్ హెచ్.కృష్ణారావు, ఆమదాలవలస మండల ఎగ్జిక్యూటివ్ ఎం.ధనలక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


స్వామివారి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వరి కోతలు వాయిదా వేసుకోండి

నరసన్నపేట: తుఫాన్ నేపథ్యంలో రైతులు వరి కోతలు కోయవద్దని ఏఓ కె.సునీత సూచించారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు వర్ష ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించదన్నారు. అప్పటివరకు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. మండలంలోని యారబాడు, కోమర్తి గ్రామాల్లో మంగళవారం పర్యటించి రైతులకు ఈ మేరకు సూచించారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, రోడ్ల వెంబడి ఉంచితే వర్షానికి తడిచే ప్రమాదం ఉందన్నారు. పొలంలో ఉన్న పనలను కుప్పలుగా పెట్టి టార్పాలిన్లు కప్పాలన్నారు.